సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



శివాలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రం సందర్శన

కమాన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ గురువారం పరిశీలించారు. పోలింగ్‌శాతం, సౌకర్యాలు తెలుసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమర్థవంతంగా పోలింగ్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజేశ్ రాణా

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేశ్ రాణా, ఆర్వో అరుణశ్రీ అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సీఆర్‌పీఎఫ్ భద్రత బలగాలు, పోలీసు సిబ్బందిని అప్రమత్తంగా ఉంటూ అసాంఘిక కార్యక్రమాలు, ఎన్నికల ఉల్లంఘన చర్యలను నివారించాలని సూచించారు. 56వ పోలింగ్ కేంద్రంలో ఆర్వో అరుణశ్రీ ఓటు హక్కు వినియోగించుకొని బీఎల్వో, ఆశా వర్కర్లు, పోలీసులను అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. అలాగే రామగుండం మున్సిపల్ కమిషనర్ సీహెచ్. నాగేశ్వర్, ఏఆర్వో కుమారస్వామి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రావూఫ్ ఖాన్, స్వీప్ రామగుండం నోడల్ అధికారి స్వరూపరాణి, మీడియా అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజినితో పాటు పలువురు అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఆకట్టుకున్న 'నా ఓటు నా హక్కు' రంగవల్లి



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని 56వ పోలింగ్ స్టేషన్ వద్ద ఆర్పీ స్వప్న వేసిన నా ఓటు నా హక్కు రంగవల్లిక పలువురిని ఆకట్టుకుంది. హిందీలో మేరా ఓటు మేరా అధికార్ అనే పదాలు, ముగ్గులో జాతీయ పతాకం, ఎలక్షన్ కమిషన్ లోగో, నెమలి పింఛన్‌తో రంగవల్లిక టౌన్‌షిప్‌లోని ఇతర రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులను ఆకట్టుకున్నాయి.

ఈవీఎంల మొరాయింపు



పోలింగ్ కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న ఓటర్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి, ఓదెల, ఎలిగేడు మండలాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు కొంతసేపు పోలింగ్ బూత్ ఆవరణలోనే నిరీక్షించారు. పెద్దకల్వలలోని 74వ పోలింగ్ బూత్, భోజన్నపేటలోని 86వ బూత్‌తో పాటు ఓదెల మండలం కొమిరెలోని 167, ఎలిగేడు మండలం లాలపల్లిలోని 266 బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పోలింగ్ కొనసాగించారు. ఈవీఎంలు పనిచేయక పోవడంతో ఓటర్లు కొంత అసహనానికి గురయ్యారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న నాయకులు

మంథని: మంథని మండలం వెంకటాపూర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు ఎదుట దిగిన కాంగ్రెస్ నాయకులు క్యూ లైన్ పాటించడం లేదని బీఆర్‌ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తోపుటాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అలాగే ఎక్లాస్‌పూర్ కేంద్రంలో క్యూలైన్‌లో ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణ పడ్డారు.

ప్రలోభపెట్టిన అధికారులపై ఫిర్యాదు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంథని మండలం నాగారం, మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్‌పేటలో పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఓ పార్టీకి ఓటు వేయాలని ప్రలోభపెడుతున్నారని రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఓటెత్తారు..

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- జిల్లా వ్యాప్తంగా 69.44 పోలింగ్ శాతం నమోదు
- ఉత్సాహంగా ఓటేసిన యువ ఓటర్లు
- గంట గంటకు పెరిగిన పోలింగ్
- మంథనిలో అత్యధికం.. పెద్దపల్లిలో అత్యల్పం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు పోటెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఓటింగ్ శాతం పెరిగింది. గురువారం ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేందుకు ఉత్సాహంతో ఇళ్ల నుంచి బయలుదేరడంతో పోలింగ్ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. కొన్ని కేంద్రాల్లో పోలింగ్ సమయం ముగిసినప్పటికీ కూడా ఓటర్లు క్యూలో ఉండడంతో వారు ఓటు వేసేంతవరకు అధికారులు అవకాశం కల్పించారు. సమస్యాత్మక ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో పోలింగ్ నాలుగు గంటలకే ముగిసింది. అయితే 4లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వచ్చిన వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సమస్మాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు ఈవీఎం మెషిన్లను రామగిరి మండలంలోని జేఎన్‌టీయూ కాలేజీ ఆవరణలోని స్ట్రాంగ్ రూంలకు పటిష్ట బందోబస్తు మధ్య తరలించారు.

మందకొడిగా మొదలై పుంజుకున్న పోలింగ్

అన్ని గ్రామాల్లో ఉదయం 7 గంటలకు మందకోడిగా మొదలైన పోలింగ్ ఉదయం 9 గంటల తర్వాత పుంజుకుంది. ఉదయం వేళలో చలితో పాటు, గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు, యాసంగి పంట పనులు జరగుతుండటంతో ఉదయం 11 గంటలకే ఎక్కువ మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల వరకు 9.76 శాతం నమోదు కాగా 11 గంటలకు 23.48 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 43.06, 3గంటలకు 57.50శాతం, 5గంటల వరకు 69.44 శాతం నమోదైంది. 4,94,223 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అధికారుల పర్యవేక్షణ.. పోలీసుల భారీ బందోబస్తు..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ తీరుపై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్వోలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అలాగే రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

ఓటు కోసం సొంతూరికి..

ఓటు హక్కును వినియోగించుకోవడానికి పెద్ద ఎత్తున హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చదువుకుంటున్న యువత, ఉద్యోగులు గ్రామాల్లోకి వచ్చారు. ఎన్నికల్లో గెలుపు ఓటములకు ప్రతీ ఓటు కీలకమే కావడంతో పోటీ చేసిన అభ్యర్థులు రవాణా చార్జీలు వారికి చెల్లించి మరీ సొంత ఊరికి రప్పించారు. ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువత కేంద్రాల వద్ద బారులు తీరి తమ మొదటి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనికితోడుగా మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటు వేయడానికి వచ్చిన మహిళలకు పువ్వులతో స్వాగతం పలికారు. దీంతో గతంలో కంటే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. వీరితో పాటు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వివిధ పార్టీల తరపున ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కమాన్‌పూర్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు



పెద్దపల్లిలో ఓటేశానంటున్న 95 ఏళ్ల వృద్ధురాలు



చంటి పిల్లలతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు

పోలింగ్ సరళి గంట గంటకు:(శాతంలో)

అసెంబ్లీ	7-9	9-11	11-01	01-03	03-05
రామగుండం	9.1	17.36	38.79	49.36	67.21
మంథని	8.2	31.6	51.4	68.15	74.12
పెద్దపల్లి	12.0	21.5	39.0	55.0	67.01
సరాసరి	9.76	23.48	43.06	57.5	69.44

(కొన్ని కేంద్రాల్లో రాత్రి వరకు కొనసాగడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశముంది)



ఓటు వేశామని సిరా మార్క్ చూపిస్తున్న మహిళలు



ఓటరుకు సిరా గుర్తు పెడుతున్న ఎన్నికల సిబ్బంది



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బారులు తీరిన ఓటర్లు



ఓటేసిన మహిళలు



దివ్యాంగులను వీల్‌చైర్‌లో తరలిస్తున్న సిబ్బంది



ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగుడు



ఈవీఎంలను సర్దుకుంటున్న సిబ్బంది

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం



పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఓటరు జాబితాలో ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రంగంపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్ర ఆవరణలో ఉన్న ఓటర్లతో ముచ్చటించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లందరికీ అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గెలువబోతోంది. కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థి, ఉద్యోగులు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారు. కరోనా ప్రజలకు అండగా నిలిచాం. మిగిలిన మూడేళ్లలో ప్రజల్లో ఉన్నా. ఈప్రాంతానికి మెడికల్ కళాశాలతో అనేక పనులు చేశాం.

– కోరుకంటి చందర్, రామగుండం ఎమ్మెల్యే

ప్రజలు మార్పు కోరుతున్నారు



ఇన్నాళ్లు సాగిన దొరల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు మార్పు కోరుతున్నారు. ఈఎన్నికల్లో విజయకేతం ఎగురవేస్తున్నాం. దొరలు, గడీల పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది. ఈ ప్రాంతంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగుల బలిదానాలు ప్రజల్లో ఆగ్రహాన్ని తెప్పించాయి.

– ఎంఎస్ రాజ్‌ఠాగూర్, కాంగ్రెస్ అభ్యర్థి, రామగుండం

సైలెంట్ ఓటింగ్ బీజేపీవైపే



ఈసారి సైలెంట్ ఓటింగ్ బీజేపీ వైపు నిలిచింది. రాష్ట్రంలో బీజేపీ గాలివీస్తోంది. ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తా. యువ ఓటర్లు, మహిళలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు బీజేపీ వైపు నిలిచాయి.

– కందుల సంధ్యారాణి, బీజేపీ అభ్యర్థి, రామగుండం

హ్యాట్రిక్ విజయం సాధిస్తా



పోరాడి సాధించుకు న్న తెలంగాణను సీ ఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించిన ఓటర్లు ఈసారి ఎన్నికల్లోనూ ఎన్నుకుంటారనే విశ్వాసం ఉంది. తప్పకుండా గెలిచి హ్యాట్రిక్ విజయం సాధిస్తా.

– దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి

కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు



బీఆర్‌ఎస్ ప్రభుత్వం, స్థానిక నాయకత్వం తీరుపై ప్రజల్లో తీవ్రమైన నిరసన ఉన్న క్రమంలో కాంగ్రెస్ వైపు పెద్ద ఎత్తున మొగ్గు చూపినట్లు కనిపించింది. మంథని నియోజకవర్గంలో ముంపు సమస్య, స్థానిక నాయకత్వం వైఫల్యాలపై ప్రజలు తీవ్ర స్థాయిలో విసుగుచెందారు. అన్నింటిని గమనించిన నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారనే విశ్వాసం.

– దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే, మంథని

ప్రజలు ఆశీర్వాదించారనే నమ్మకం



పోలింగ్ సరళిని పరిశీలిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, తనను ఆశీర్వదించారనే విశ్వాసం కనిపించింది. ప్రజల ముఖల్లో కనిపించిన తీరు సంతోషాన్ని నింపింది. మరో మారు సేవ చేసే అవకాశం వస్తుంది. ప్రచార సమయంలో వారి రుణం తీర్చుకుంటానని ప్రజలకిచ్చిన హామీల మేరకు తప్పకుండా కట్టుబడి ఉంటా.

– పుట్ట మధు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంథని

బీజేపీని ఆదరించారు



గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసారి మంథని నియోజకవర్గంలో ప్రజలు బీజేపీని ఆదరించారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మంథనిలో మార్పును కోరుకున్నట్లుగానే ఓటింగ్ రూపంలో వారి చతురతను ప్రదర్శించిట్లుగా కనిపించింది.

– చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి, మంథని

మార్పు తథ్యం



నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ ప్రజలను నమ్మించి మోసగించిన పాలకులకు విముక్తి కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్న. తనపై నమ్మకంతో ఈసారి ఎన్నికల్లో ఓటిచ్చి ఎన్నుకుంటారని విశ్వాసం ఉంది. మార్పు తథ్యం.

– విజయరమణారావు, కాంగ్రెస్ అభ్యర్థి, పెద్దపల్లి

'ఈవీఎం'లో భవితవ్యం

- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- ఈనెల 3న జేఎన్‌టీయూలో కౌంటింగ్
- పెరిగిన పోలింగ్ శాతంతో అభ్యర్థుల్లో టెన్షన్

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలు గురువారం ముగియటంతో అందరి దృష్టి ఫలితాలపై పడింది. ఈవీఎంలలో ఎమ్మెల్యేల అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. ఈనెల 3న ఆదివారం రోజు కౌంటింగ్ జరుగనుంది. ఫలితాలపై అభ్యర్థులతో పాటు ఓటర్లలో కూడా ఉత్కంఠ నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందో అంచనాలకు అందడం లేదు. ఓటింగ్ శాతం అనూహ్యంగా పెరగటంతో ఫలితాలు ఎలా ఉంటాయోనని అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 838 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం, వీవీప్యాట్)లను పోలింగ్ కేంద్రాల నుంచి రామగిరి మండలంలోని జేఎన్‌టీయూ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.



ఈవీఎంలతో పెద్దపల్లికి చేరుకుంటున్న సిబ్బంది



ఈవీఎంలను అధికారులకు అప్పగిస్తున్న సిబ్బంది

పోలింగ్ సరళిపై చర్చ

పోలింగ్ ముగియటంతో జిల్లాలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల పైనే చర్చ జరుగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోలింగ్ సరళిని విశ్లేషించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. రేపు, ఎల్లుండి ప్రధాన పార్టీల రాజకీయ పార్టీల అభ్యర్థులు పార్టీ ముఖ్యనాయకులు, బూత్ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ఓటింగ్ తీరు తెన్నులతోపాటు పార్టీ విజయావకాశాలను ఎమ్మెల్యే అభ్యర్థులు విశ్లేషించుకోనున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై పోస్టుమార్టం

ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించడానికి వివిధ పార్టీలు తాయిలాలు, నోట్లు పంపిణీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాయి. అయితే అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణులు చేతివాటంతో పూర్తిస్థాయిలో ఓటర్లకు చేరలేదు. దీంతో నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల ఓటర్లు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేశారు. మొత్తంగా చూస్తే పోల్ మేనేజ్‌మెంట్ చేయటంతో అధికార పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉన్నట్లు కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ గెలుపుపై ఆశలు పెట్టుకోగా, త్రిముఖ పోటీలో వ్యతిరేక ఓటు చీలి తమకే గెలుపు వరించనున్నదని బీఆర్‌ఎస్ శ్రేణులు అంచనాలు వేస్తున్నారు. ఎవరి అంచనాలు నిజమయ్యేది డిసెంబర్ 3న తేలనుంది.

నిఘా నీడలో ప్రశాంతంగా పోలింగ్

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- పలు పోలింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



పోలింగ్ కేంద్రం వద్ద సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: పోలీసు నిఘా నీడలో రామగుండం పోలీస్ కమిషరేట్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఆకస్మికంగా సందర్శించారు. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని మంథని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ సందర్శించి విధి నిర్వహణలో ఉన్న అక్కడి పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తర్వాత పరికరాలను కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు గురించి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, మంథని సీఐ సతీశ్, పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, టాస్క్ ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్ ఎస్సైలు ఉన్నారు.

ఓటు కోసం ముంబయి, పూణె నుంచి 70 కుటుంబాలు

మంథని: ఉపాధి కోసం ముంబాయి, పూణెకు వలస వెళ్లిన మంథని మండలం బెస్తపల్లికి చెందిన 70 కుటుంబాలు ఓటు వేసేందుకు గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. సమీపంలోని సిరిపురంకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కూలీ కో సం వెళ్లిన తాము ఓటు గ్రామంలోనే ఉండడంతో ఓ టు హక్కును వినియోగించుకునేందుకు వచ్చినట్లు తెలిపారు.



క్లుప్తంగా

ఓటర్లకు డబ్బులు పంచిన వ్యక్తులపై కేసు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని పలు చోట్ల గురువారం ఓటర్లకు పంచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. బేతిగల్‌లో వీరంనేని సంపత్‌రావు నుంచి రూ. 93, 500, వీణవంకలో రాయిశెట్టి కుమార్ నుంచి రూ. 99 వేలు, చల్లూరులో మహమ్మద్ అఖిల్ పాషా, గూడెపు సమ్మయ్యల నుంచి రూ.30 వేలు పట్టుకొని, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కనపర్తిలో బీర్లు పంచుతున్న లోకిని మల్లేశ్‌ను పట్టుకున్న ట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సొల్లు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేందర్ గురువారం ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెడుతూ డబ్బులు పంచుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తన ఫోన్‌లో వీడియో తీసి, పోలీసులకు పంపించాడు. దీని ఆధారంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు సురేందర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దొంగ ఓటు వేసిన వ్యక్తిపై..

సాక్షి, పెద్దపల్లి: ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆకారి సత్యం దొంగ ఓటు వేశారని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బీఆర్‌ఎస్ యూత్ కోఆర్డినేటర్ సత్యం బొట్లవరపర్తి గ్రామంలోని 158 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఓటు వేసిన సమయంలో అధికారులు చేతి వేలుకు సిరాను వేసిన, దానిని అతడు చెరిపి వేశాడు. తిరిగి రెండోసారి ధర్మారంలోని 134 పోలింగ్ బూత్‌లో మరోసారి దొంగ ఓటు వేశాడు. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఓరం చిరంజీవి అతనిపై పీవోకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఎన్నికల అధికారులు రెండు పోలింగ్ కేంద్రాల్లో వేసిన ఓటును చెక్ చేశారు. రెండు చోట్ల ఓటు వేసినట్లు నిర్ధారించుకున్న ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ మెజిస్ట్రేట్ చలపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేటలో దిగువ కొండగట్టు వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. కొండగట్టుకు చెందిన ఎల్లయ్య బైక్‌పై రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా, ఈఎంటీ జ్యోతి, పైలట్ అనిల్ వచ్చి, ప్రథమ చికిత్స చేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ అవే ఓటు పాట్లు



రాజన్నసిరిసిల్ల జిల్లా తొలి కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్ అందరికీ సుపరిచితులే. ఆయన రెండు పర్యాయాలు జిల్లాలో కలెక్టర్‌గా పనిచేశారు. రెండున్నరేళ్ల కిందట ఆయన బదిలీ అయ్యారు. కానీ కృష్ణభాస్కర్ పేరిట సిరిసిల్లలోని ఇంటి నంబరు 6–6–73లో ఓటుహక్కును కల్పించారు. జిల్లాలో పనిచేసిన కాలంలో ఓటేసుందుకు నమోదు చేసుకోగా.. ఆయన బదిలీ అయినా.. కూడా ఇంకా జిల్లా ఓటరుగా జాబితాలో ఉన్నారు.



ఇతను కోడం ప్రభాకర్. సిరిసిల్లలోని శాంతినగర్‌కు చెందిన వస్త్ర వ్యాపారి. మూడేళ్ల కిందట ప్రభాకర్ మరణించారు. కానీ ఓటర్ల జాబితాలో పేరు ప్రత్యక్షమైంది. కోడం ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఓటరు జాబితాలో ప్రభాకర్ పేరును చూసి.. అవాక్కయ్యారు. చనిపోయిన వ్యక్తి పేరును ఓటర్ల సవరణలో కనీసం గుర్తించకపోవడం గమనార్హం.

- తప్పుల తడకగా ఓటరు జాబితా
- అందని ఓటరు సమాచార స్లిప్‌లు
- బదిలీ అయిన కలెక్టర్‌కు ఓటు
- చనిపోయిన వారికి జాబితాలో స్థానం
- ఇదీ సిరిసిల్ల రెవెన్యూ అధికారుల లీలలు



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా పరిశీలన

సిరిసిల్ల: తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యమంటూ రెవెన్యూ అధికారులు బూత్ లెవల్ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించడం, సెలవు రోజుల్లో సవరణల పేరిట పోలింగ్‌స్టేషన్(సూకల్స్)లో అందుబాటులో ఉంచడం జరుగుతుంది. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో తప్పుల తడకలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచి గందరగోళాన్ని సృష్టించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను నమోదు చేయకుండా.. పాత జాబితా ఆధారంగా తప్పుల జాబితాను ఎన్నికలకు అందుబాటులో ఉంచడం విమర్శలకు తావిస్తుంది.

అందని ఓటరు సమాచార స్లిప్‌లు

జిల్లాలో ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్‌లను అందించామని జిల్లా అధికార యంత్రాంగం గొప్పగా ప్రకటించింది. కానీ వాస్తవానికి 50 శాతం ఓటర్లకు కూడా ఆ సమాచార స్లిప్‌లను అందించలేదు. ఫలితంగా ఓటర్లు పోలింగ్‌స్టేషన్‌తోపాటు ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉందో తెలియక చాలా మంది తికమక పడ్డారు. చివరికి ఓటు వేయకుండానే వెనుదిరిగారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఫలితంగా ఓటర్లు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్‌శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో గురువారం ఓటు పాట్లు తప్పలేదు.

చిగురుమామిడి జెడ్పీటీసీపై ఫిర్యాదు

- పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేశాడన్న హుస్నాబాద్ ఎమ్మెల్యే
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్‌పై సీపీ అభిషేక్ మహంతికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.. చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. గురువారం ఓటింగ్ ప్రారంభమవగా 131వ బూత్‌లో చీకటిగా ఉండటం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల గుర్తులు కనిపించలేదు. పోలింగ్ సిబ్బంది కూడా వారికి సహకరించడం లేదని పలువురు బయటకు వచ్చారు. దీంతో జెడ్పీటీసీ రవీందర్ సంబంధిత బూత్‌లోకి వెళ్లి, ఓటువేసే గదిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పేందుకు ప్రయత్నించారు. అలాగే, చేతి గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రచారం చేస్తున్నాడని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు తెలియజేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన కరీంనగర్ సీపీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐకి ఫోన్ చేసి, తక్షణమే రవీందర్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత సీఐ తన సిబ్బందితో ఆయనను ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రవీందర్ పోలీసు కస్టడీలో ఉన్నారు.

కావాలనే ఫిర్యాదు చేశారు : జెడ్పీటీసీ రవీందర్

పోలింగ్ కేంద్రంలో నేను ఎలాంటి ప్రచారం చేయలేదు. 131వ బూత్‌లో చీకటిగా ఉందన్న సమాచారంతో పోలింగ్ అధికారికి విషయాన్ని చెప్పేందుకు వెళ్లాను. అంతేగానీ ఎన్నికల నిబంధనలు అతిక్రమించలేదు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కావాలనే నాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం చిగురుమామిడి మండలంలోని రేకొండ పరిధి పెద్దమ్మపల్లెలో ఆయన ఓటు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలను ఓటర్లు చమరగీతం పాడబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులందరూ గెలవబోతున్నారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో చూసినా ఎక్కువ మంది ఓటర్లుచేతి గుర్తుకు మొగ్గు చూపారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దూరభారం.. ఓటుపై మమకారం

- దేశవిదేశాల నుంచి వచ్చిన జిల్లావాసులు

సిరిసిల్ల/వేములవాడ/తంగళ్లపల్లి: ఎన్నికల వేళ.. దూరభారాన్ని అధిగమించి ఓటు వేసేందుకు రావడం విశేషం. ఊరిలో ఉండి.. ఓటు వేసేందుకు సైతం పోలింగ్‌స్టేషన్ వరకు రాకుండా.. నిర్లక్ష్యం చేసే ఈ రోజుల్లో హైదరాబాద్‌తోపాటు విదేశాల్లో ఉన్న వారు సైతం ఓటు వేసేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లాకు వచ్చారు. స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వేములవాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ తోట రామ్ కుమార్, జావిద్ దుబాయ్ నుంచి వచ్చి ఓటు వేశారు. కాన్పూర్ ఐఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌కు చెందిన చీకోటి శ్రీహిత ఓటుహక్కు కోసం స్వగ్రామానికి వచ్చింది.







దుబాయ్ నుంచి వచ్చిన రామ్‌కుమార్, జావిద్, కాన్పూర్ నుంచి వచ్చిన శ్రీహిత

ఓటు వేసేందుకు వచ్చాం



మాది కోనరావుపేట మండలం బావుసాయిపేట. మేమిద్దరం హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఉంటాం. మా ఇద్దరు అబ్బాయిలలో ఒకరు డాక్టర్, ఇంకొకరు ఇంజినీర్. మాకు స్వగ్రామంలోనే ఓటుహక్కు ఉంది. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. బంధువులతో కలిసి ఇలా ఓటు వేయడం సంతోషంగా ఉంది. స్నేహితులందరూ కలిశారు.

– చీటి రామారావు–జలజ దంపతులు, బావుసాయిపేట

ప్రతీసారి ఇక్కడే ఓటు వేస్తాం



మాది తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల. ప్రతీసారి ఎన్నికల సమయంలో ఇక్కడికే వచ్చి ఓటు వేస్తాం. ఉద్యోగరీత్య హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. ఏ ఎన్నికలు వచ్చినా.. ఓటు వేయడం మాత్రం మా ఊరిలోనే. ఈసారి ముందే ప్లాన్ చేసుకుని వచ్చి ఓటు వేశాం. మా అన్న విజయేందర్‌రెడ్డి, వదినే సంధ్య, మా కూతురు మనస్వితారెడ్డి, మా ఆవిడ ఉమాతో కలిసి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– పబ్బతి జితేందర్‌రెడ్డి –ఉమా దంపతులు, జిల్లెల్ల

ఓటువేసి.. వరి కోయించేందుకు వెళ్లి

- గుండెపోటుతో రైతు మృతి
- ముత్తారంలో ఘటన



రాజయ్య మృతదేహం

ముత్తారం(మంథని): ఓటువేసి.. వరి కోయించేందుకు పొలం వద్దకు వెళ్లిన ఓ రైతు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ముత్తారానికి చెందిన రాపెల్లి రాజయ్య(65) గురువారం ఉదయం ఓటుహక్కు వినియోగించుకున్నాడు. తర్వాత తన కున్న ఎకరం భూమిలో వరి కోయించేందుకు వెళ్లాడు. పొలం దిగబడుతుండటంతో కోత మెషీన్ వచ్చేలోపు కొంతవరకు కోశాడు. దాన్ని కుప్ప చేస్తుండగా ఒక్కసారి ఛాతిలో నొప్పి, రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్లిన ఓ రైతు రాజయ్యను చూసి, లేపే ప్రయత్నం చేశాడు. లేవకపోవడంతో అతను చనిపోయాడన్న సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేశాడు. ఓటు వేసి, పొలంకాడికి పోయి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అతనికి భార్య కనకలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

బీఆర్‌ఎస్ గెలుస్తుందని సంబరాలు



సిరిసిల్లలో వేడుకల్లో పాల్గొన్న చీటి నర్సింగరావు, బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో బీఆర్‌ఎస్ మళ్లీ గెలువబోతుందని ఆ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరిపారు. రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ యూత్ విభాగం నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, నినాదాలు చేశారు. ఓటింగ్ సరళితో మంత్రి కేటీఆర్ మళ్లీ గెలుస్తున్నారని, సిరిసిల్ల మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్, షేక్ సికిందర్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఫలితాలు వెలువడకముందే ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ సంబరాలు నిర్వహించడం ఏందని స్థానికంగా విమర్శలు రావడం గమనార్హం.

బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించనున్నారు
- బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు నిలిచారని, కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మబోరని, పదేళ్లుగా జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టనున్నారని కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాలుగా పరిపాలించిన రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధిని విస్మరించాయని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ సారథ్యంలో పదేళ్లల్లోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలకు కళ్లమంట మొదలైందని అన్నారు. ఏదిఏమైనా రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కరీంనగర్‌లో అత్యధిక మెజార్టీతో తాను గెలవడం తథ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సవాల్ విసిరి, పారిపోయాడు

- మంత్రి గంగులపై బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: తాను డబ్బు పంచానని ఆరోపించి, ప్రమాణం చేయాలంటూ సవాలు విసిరిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కమలాకర్ పారిపోయాడని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, అభ్యర్థి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీజేపీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. గురువారం కరీంనగర్ జ్యోతినగర్‌లో 174వ పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ దాడులు చేస్తుందని, మరేదో చేస్తుందంటూ తనపై సామాజిక మాధ్యమాల ద్వారా బురద చల్లే ప్రయత్నం చేశారని, వాటిని ప్రజలు నమ్మలేదని అన్నారు. జలాల విషయంలో పక్క రాష్ట్రంతో కుమ్మక్కయిన కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశాడన్నారు. కరీంనగర్ పట్టణంతో పాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో వివిధ గ్రామాలకు వెళ్లి ఓటింగ్ సరళి తెలుసుకున్నారు.

ఓటర్లపై కుక్క దాడి : పది మందికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లపై ఓ కుక్క దాడిచేసింది. పోలింగ్ కేంద్రానికి ఓటేసేందుకు వచ్చిన వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసింది. బూత్‌నంబర్ 206, 207 పోలింగ్ కేంద్రాల ఎదుట వేచి ఉన్న పది మందిపై కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో కొండెల్లి నర్సయ్య, సీహెచ్.లస్మవ్వ, ఆర్.పద్మ, నల్ల చారి, జవహర్ తీవ్రంగా గాయపడ్డారు. మోహర్ల నర్సవ్వ, రేసు రఘు, జంగ భూమరాజం, దిలీప్, బొదాసు రాజు గాయపడ్డారు. వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడ్డ నర్సయ్య, లస్మవ్వ, జవహర్‌లను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.



విద్యుదాఘాతంతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

మానకొండూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన గాడిచర్ల అజయ్‌కుమార్(14) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్‌కుమార్ తన తాత లింగయ్యతో కలిసి గురువారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్‌కు ఉన్న నల్లా వాల్వ్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



సత్తయ్య మృతదేహం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో శాంతినగర్‌కు చెందిన సత్తయ్య(40) మృతిచెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలు. సత్తయ్య బైపాస్ రోడ్డు నుంచి శాంతినగర్‌కు వెళ్లడానికి బైపాస్ మీదుగా కాలినడకన వస్తున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో బంధువులు కరీంనగర్ తరలించేందుకు ప్రయత్నించగా దారి మధ్యలోనే సత్తయ్య మృతి చెందాడు.

సర్వం సాంకేతికమయం

- పోలింగ్ కేంద్రాల్లో ఇన్‌సైడ్, ఔట్‌సైడ్ వెబ్‌కాస్టింగ్
- జిల్లా నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వరకు వీక్షణ
- కొనసాగుతున్న ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ తనిఖీలు



పోలింగ్ కేంద్రాల తీరును గమనిస్తున్న అధికారి

కరీంనగర్ అర్బన్: సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ సర్వం సాంకేతికమయమే. అసెంబ్లీ సాధారణ ఎన్నికల క్రమంలో తొలిసారిగా అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్ టీంలకు అత్యంత ఆధునిక కెమెరాలు వినియోగించగా కలెక్టరేట్ ప్రధాన విభాగంతో పాటు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నిరంతరం వీక్షిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వీక్షించేలా అనుసంధానించారు. అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఇదే తొలిసారి కాగా ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని వినియోగించారు. గురువారం జరిగిన పోలింగ్‌పై జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయగా ఎప్పటికప్పుడు పోలీస్, ఎన్నికల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలకుగానూ 899 కేంద్రాల్లో ఇన్‌సైడ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయగా మిగతా పోలింగ్ కేంద్రాల్లో ఔట్‌సైడ్ వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో గొడవలు, ఎక్కువగా మంది గుమికూడటం, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాల పనితీరును పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ఎం.రజనీకాంత్, ఎన్‌ఐసీ ఏడీఎం శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు పరిశీలించగా ఆయా విభాగాలను అప్రమత్తం చేశారు.

కొనసాగుతున్న తనిఖీలు

ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వైలెన్ టీంల తనిఖీలు గురువారం కూడ కొనసాగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు బిగించిన సీసీ కెమెరాల ద్వారా సదరు వాహనాలు ఎటెటు వెళుతున్నాయి, ఎంత సమయంలో ఫిర్యాదును పరిష్కరించాయి వంటి అంశాలను పరిశీలించగా జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ టీంలు(చెక్‌పోస్టులు)ల్లో వారి పనితీరును నిశితంగా గమనించారు.

వ్యక్తి బలవన్మరణం

గంగాధర(చొప్పదండి): మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన కూన లచ్చయ్య(58) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లచ్చయ్యకు భార్య లక్ష్మీనర్సమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోసించాడు. ఇటీవల అప్పులు చేసి, కూతుళ్లకు వివాహాలు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ నిత్యం బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోం ఓటు వేసిన వృద్ధుడి మృతి



బక్కయ్య (ఫైల్)

రాయికల్(జగిత్యాల): మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన బొల్లె బక్కయ్య(85) నవంబర్ 25వ తేదీన హోం ఓటింగ్‌లో పాల్గొన్నాడు. ఈక్రమంలో అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఓటింగ్ పాల్గొన్న బక్కయ్య తన ఓటును లెక్కించేలోపే మృతిచెందాడు.

గెలుపోటములపై జోరుగా బెట్టింగ్

- బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా చర్చ
- రెండు నియోజకవర్గాల్లో టెన్షన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రజల నుంచి అత్యంత స్పందన అచిరకాలంలో గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపోటములపై కార్యకర్తలు, అభిమానులు జోరుగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌ను భారత్ పాకిస్థాన్ క్రికెట్ పోటీని వీక్షించిన విధానంలో ఓట్ల లెక్కింపును చూసే అవకాశాలున్నాయని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల్లో బెట్టింగ్‌కు ఆజ్యం పలికిన నాయకులు ఉన్నారని, ఇలా బెట్టింగ్ చేసిన వారందరూ ఓట్ల లెక్కింపు జరిగే ఆదివారం ఒకే వేదికగా ఉండి పండుగ చేసుకునేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధిని ప్రచారం చేసిన కేటీఆర్‌కు విజయం కాస్త అటు.. ఇటుగా ఉంటుందనుకుంటున్న వాళ్లు లేకపోలేదు. కానీ వేములవాడలోని త్రిముఖ పోరులు అందరూ ఉద్దండులేనని ఇక్కడి ఫలితాలపై నియోజకవర్గప్రజలు అత్యంత ఆసక్తిగా ఉన్నారని సమాచారం. ఏదిఏమైనా గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో నేతలు హోరాహోరీగా ప్రచారాలు, పార్టీల బడా నేతలు రావడం వంటి వాటితో గెలుపు ఆయా పార్టీ బాధ్యులు ఆసక్తిగా ఎదురుచూస్తూ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలాంటి విధానాలను పోలీసు అధికారులు ఎలా నియంత్రిస్తారో వేచిచూడాల్సిందే.